మతోన్మాదులతో ప్రమాదం

- వారిని అడ్డుకుంటేనే భవిష్యత్తు
- ఐక్యపోరాటాలతోనే అందరికీ విద్య
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలో మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె చంద్రు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశసమైక్యత కోసం ఉద్యమించాలని మద్రాస్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ కె చంద్రు విద్యార్థులకు పిలుపునిచ్చారు. మతోన్మాద శక్తులను అడ్డుకట్టవేస్తేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇందుకోసం విద్యార్థులు ఐక్యం కావాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత 17వ మహాసభ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఉన్న ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఎస్ఎఫ్ఐ జెండాను ఆ సంఘం జాతీయ అధ్యక్షులు విపి సాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రతినిధుల సభనుద్దేశించి జస్టిస్ చంద్రు మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ తొలి మహాసభలో తాను ప్రతినిధిగా ఉన్నానని గుర్తు చేశారు. ఆ సంఘం ఆవిర్భవించినపుడు అందరికీ విద్య- అందరికీ ఉపాధి లక్ష్యంగా ఉండేదన్నారు. 52 ఏండ్ల తర్వాత ఆ లక్ష్యాలతోపాటు అందరూ ఐక్యం కావాలని చెప్పడం ముఖ్యమని అన్నారు. ఐక్య పోరాటాలతోనే అందరికీ విద్య - అందరికీ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించినపుడు నిర్బంధం ఉండేదనీ, అణచివేత, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు కొనసాగాయని వివరించారు. ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదనీ, ప్రశ్నిస్తే జైళ్లలో వేస్తున్నారని విమర్శించారు. బాబ్రీ మసీదును కూల్చినపుడు యుపిలో కల్యాణ్‌సింగ్ సిఎంగా ఉన్నారని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఆయన రోజూ కోర్టుకు హాజరయ్యేవారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆయనకు పద్మశ్రీ ఇచ్చారనీ, రామమందిరం కోసం రథయాత్ర చేసిన అద్వానీకి భారతరత్న ఇచ్చినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదని వ్యాఖ్యానించారు. నవరత్నాలను, ప్రభుత్వరంగ సంస్థలను, సంపదను అంబానీ, అదానీకి మోడీ ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. అందరికీ విద్య ఉపాధి గురించి కాకుండా రామజన్మభూమి గురించి చర్చ జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు కేరళ ప్రభుత్వం వ్యతిరేకమని చెప్పారు. అయినా సుప్రీంకోర్టుకు వెళ్లి తిరువనంతపురం ఎయిర్‌పోర్టును అదానీ దక్కించుకున్నారని వివరించారు. న్యాయవ్యవస్థ మోడీ-షాకు సహకరిస్తున్నదని అన్నారు. సోషలిస్టు, సెక్యులర్, రిపబ్లిక్ అని రాజ్యాంగంలోని పీఠికలో ఉందన్నారు. ఇప్పుడు వాటిని సవరించేందుకు మోడీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని విమర్శించారు. కేరళ, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల పనివిధానాన్ని గమనిస్తున్నామనీ, ఆర్ఎస్ఎస్ ఎజెండాను వారు అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిపరచేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాల సవరణను, కార్మికకోడ్‌లను ఐఎల్ఓ అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. విద్యారంగం ఇప్పటికే ప్రయివేటు పరమైందని వివరించారు. అందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రయివేటు యాజమాన్యాలు దెబ్బతీస్తున్నాయని అన్నారు. రాష్ట్రాల చేతుల్లో ఉండాల్సిన విద్యారంగాన్ని కేంద్రం లాగేసుకుంటున్నదని విమర్శించారు. దేశ సమైక్యతను కాపాడుకోవాలనీ, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనీ, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణతోపాటు అందరికీ విద్య, ఉపాధి కోసం ఐక్యంగా ఉద్యమించేలా ఈ మహాసభల్లో చర్చించాలని కోరారు. సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ వీడియో సందేశాన్ని పంపించారు.

సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం : నర్సిరెడ్డి

భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఇప్పటికీ స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నాడు భూస్వాములకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పేదలు పోరాటం చేశారని అన్నారు. కానీ దీన్ని మతపరంగా విభజించి హిందూ-ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బిజెపి విషప్రచారం చేస్తున్నదని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్, ధీరజ్ తండ్రి రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్, గర్ల్స్ కన్వీనర్ దీప్సితా ధర్, కార్యదర్శివర్గ సభ్యులు దీనిత్‌డెంటా, నితీష్ నారాయణ్, సచిన్‌దేవ్, వినీష్, మరియప్పన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, ఏపీ అధ్యక్షులు ప్రసన్న పాల్గొన్నారు.

అన్ని రోగాలకు సరైన వైద్యం ఆక్యుపంక్చర్

- సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి
- ఎస్‌వికెలో ఆక్యూపంచర్ హీలింగ్ సెంటర్‌ను ప్రారంభించిన వినయకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేడు మారుతున్న కాలంలో అనేక రోగాలకు సరైన వైద్యం ఆక్యూపంక్చర్ విధానమని ఎపి ప్రభుత్వ మాజీ సలహాదారులు, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం ఆక్యూపంక్చర్ హీలింగ్ సెంటర్‌ను ఎస్‌వికె కార్యదర్శి ఎస్.వినయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడి ఆధారంగా రోగ నిర్ధారణ చేసి.. సింగిల్ సిడిల్ ద్వారా అనేక రోగాలను నయం చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రాచీన కాలానికి సంబంధించిన ఈ వైద్యానికి మందులు కూడా వాడాల్సిన అవసరం ఉండదని, దీనివల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. పేదలకు అందుబాటులో ఉండే విధంగా ఈ సెంటర్‌ను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వినయకుమార్ మాట్లాడుతూ.. ఔషధాలు, సైడ్ ఎఫెక్ట్‌లు లేని ఈ వైద్యాన్ని అందరూ సద్వినియోగించుకోవాలని కోరారు. మోకాళ్ల, వెన్నుముక నొప్పులకు ఈ వైద్యం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. సోమవారం మినహా అన్ని రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీలర్ కాపర్తి జనార్దన్, హీలర్ ఎ.నారాయణరావు, నవతెలంగాణ బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, మెట్రో ఛానల్స్ అధినేత దేవరకొండ కాళీదాస్, హీలర్స్ సుమలత పాల్గొన్నారు.

తెలంగాణలో డైఫుక్ తయారీ కేంద్రం

- రూ.450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

జపనీస్‌కు చెందిన తయారీ రంగ సంస్థ డైఫుక్ తెలంగాణ రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. ఆటోమేటెడ్ మెటీరియల్ హ్యాండ్లింగ్ టెక్నాలజీ, సొల్యూషన్స్ అందించే ఈ సంస్థ హైదరాబాద్‌లోని చందనవెల్లిలో నూతన తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కెటిఆర్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఒప్పందం కుదర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. "రూ.450 కోట్లతో యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. వచ్చే 18 నెలల్లో తయారీ కార్యకలాపాలను ప్రారంభించనుంది. సుమారు 800 మందికిపైగా ప్రత్యక్షంగా ఉపాధి కల్పించనుంది. ఆటోమేటెడ్ స్టోరేజ్ సిస్టమ్స్, కన్వేయర్లు సహా ఆటోమేటిక్ స్టార్టర్స్ వంటి పరికరాలను ఈ సంస్థ తయారు చేస్తోంది. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ పెంచి అత్యాధునిక పరిశ్రమను స్థాపించనుంది. మొదటి దశ విస్తరణ కోసం రూ.200 కోట్ల ప్రణాళికాబద్ధమైన పెట్టుబడికి ప్రణాళికలు రూపొందించింది." అని మంత్రి కెటిఆర్ తెలిపారు. అనేక తయారీ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. జపాన్ అద్భుతమైన టెక్నాలజీ ఉపయోగించుకొని ముందుకు వెళ్తుందన్నారు. దండు మైలారంలో అతిపెద్ద పారిశ్రామిక పార్కు తీసుకొచ్చామని చెప్పారు. జపాన్ తరహాలో భారత్‌లోనూ తయారీ రంగం పుంజుకోవాలన్నారు. తెలంగాణ పారిశ్రామికవేత్తలు రూపకల్పన, తయారీపై దృష్టి పెట్టాలన్నారు. దేశానికి మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి తయారీ పరిశ్రమలను నెలకొల్పేలా ఆలోచనలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తమ తయారీ సంస్థలను ఏర్పాటు చేసిన, చేయనున్న కంపెనీలు రాష్ట్రంలో ఉన్న బాసర ట్రిబుల్ ఐటి వంటి విద్యా సంస్థలతో భాగస్వాములవ్వాలని కెటిఆర్ కోరారు. భారత్‌లో తమ ఉత్పత్తుల తయారు వేగవంతం చేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గరిమెళ్ల పేర్కొన్నారు.

టిపిసిసి అధ్యక్ష పదవి ఇవ్వండి

- ఖర్గేకు బక్క జడ్సన్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర అధ్యక్షపదవి తనకు ఇవ్వాలంటూ ఎఐసిసి సభ్యులు బక్క జడ్సన్ ఎఐసిసిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేకు ఆయన లేఖ రాశారు. దీంతోపాటు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్‌కు ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. ఆ పదవికి తనకు అన్ని అర్హతలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 106 / 2014
O.S.No. 96 / 2012
గుర్రం రమేష్ - D.H.R.
Vs
మద్దెల శ్రీనివాసులు (Died)
మరియు వగైరాలు - J.D.R's
To,
R4. దాసరి స్వాతి, భర్త శివ కుమార్, C/o N.F.C. Plot No. B7-F4, ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ రోడ్డు, విద్యానగర్, Opp. విజేత స్టడీ సర్కిల్, విజ్ఞానపురి కాలనీ, హైదరాబాద్, T.S. Pin Code: 500044.
పై నంబరు దావాలో డిక్రీ హోల్డర్ (Under Order 21, Rule 66 of C.P.C.) వేలం నిమిత్తం దరఖాస్తు దాఖలు చేసినందున మీకు తెలియజేయడమైనది. తేది: 23-12-2022 న వేలం షరతులు నిర్ణయించుటకు యేర్పరచినారు. వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 23-12-2022
కందుకూరు
వై. సాంబ శివ రావు, ఎం.కాం., బి.ఎల్., D.H.R. తరపు అడ్వకేట్, కందుకూరు.

IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURTS AT :: HYDERABAD
O.P.No.1166 of 2022
Between:-
D.Shiva Kumar and others. ...Petitioners
AND
Qureshi Tours and Travels, Rep.by Mohammed Abbas Qureshi and others. ...Respondents
To:
Respondent No.1 :
Qureshi Tours and Travels, Rep. by Mohammed Abbas Qureshi, D.No. 4-3-58/1/B/2, Qureshi Complex, Hameedpura, Bhukthapur, Adilabad Dist.
Respondent No. 3. :
Waseem Khan S/o. Qadeer Khan, Age: Major, Occ: Driver, R/o: H.No. 2-3, Muslimwada, Namoor, Adilabad Dist.
Please take notice that the above case filed for compensation under motor vehicle act, against you and others by the petitioners and the said case has been posted to 27.12.2022 for your appearance before this Hon'ble court therefore you are here by summoned to appear before the above cited Hon'ble court on **27.12.2022** at **10.30** a.m., either in person or through duly instructed advocate failing which an exparte order will be passed against you.
"BY ORDER OF THE COURT"
A. SREEDAR REDDY, Advocate.
R/o. H. No. 8-6-822, Christian Colony, Hastinapuram, Hyderabad-70.

బిజెపిని నిలువరించడానికి...
ప్రతిపక్షాలు ఏకీకృతం కావాలి

- కమలానికి వ్యతిరేకంగా ఏర్పడిన బిఆర్ఎస్‌ను స్వాగతిస్తున్నాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిని నిలువరించడానికి ఏ శక్తులు కలిసి వస్తాయో ఆ శక్తులు, ప్రతిపక్ష పార్టీలు ఏకీకృతమై ముందుకు సాగాల్సిన అవసరముందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని అమృత వనం రిసార్ట్స్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. బిజెపి సైద్ధాంతిక సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. వచ్చే జనవరి నుంచి బిజెపిని సైద్ధాంతికంగా ఎండగడ్తామని చెప్పారు. మూడు అంశాలపై ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రాలపై పెత్తనం చేయడం, హక్కులను కాలరాయడం, సామాజిక న్యాయాన్ని పాటించకపోవడం బిజెపి విధానమని ఆరోపించారు. ఇడి, ఐటి దాడులతో ప్రతిపక్ష పార్టీల నాయకుల, ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆ విధంగా వారిని లొంగదీసుకుని బిజెపిలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో బిజెపి గతం కంటే అత్యధిక అసెంబ్లీ సీట్లు గెలుపొందడం వెనుక ఆ రాష్ట్రంలో మత విద్వేషాలు, గుజరాతీ ఆత్మగౌరవం పేరుతో రెచ్చగొట్టే పనులు చేశారన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి పాలనపై వ్యతిరేకత కనిపించిందని, ప్రజలు సమస్యలపై చర్చించుకున్నారని దాని ఫలితంగానే అక్కడ ఆ పార్టీ ఓడిపోయిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఫ్రంట్‌లకు వ్యతిరేకమని, ఎన్నికల ముందు కాకుండా ఎన్నికల తర్వాత వచ్చిన సీట్లను బట్టి ఫ్రంట్ ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా తప్పులను ఎత్తి చూపుతామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేలా పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు, విఆర్ఎలు, గ్రామపంచాయతీ ఉద్యోగుల, వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2008, 1998 డిఎస్‌సి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించే దిశగా పార్టీ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలోని 119 సీట్లలో కొన్నింటిలో మాత్రమే బిజెపి పోటీ ఉండవచ్చన్నారు. బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారమయ్యేది..

- కల్లుగీత కార్మిక సంఘం సావనీర్ ఆవిష్కరణలో చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే..పోరాటమే మార్గమని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఎంవి రమణ అధ్యక్షతన ఆ సంఘం '65ఏళ్ల ఉద్యమ ప్రయాణం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చెరుపల్లితో పాటు కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్ తదితరులు ఈ సందర్భంగా సావనీర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ పాలకులు వృత్తి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పుడు కార్మికు లు సంఘటితంగా కొట్లాడి ఎన్నో విజయాలు సాదించుకున్నారని గుర్తుచేశారు. 65 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఆ విజయాలు లిఖించబడ్డాయన్నారు. ఆ పోరాటాల స్ఫూర్తితో వృత్తి రక్షణ, సంక్షేమం కోసం ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎంవి రమణ మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించడంలో ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్‌లోనూ,ఆ తర్వాత తెలంగాణలోనూ ఎన్నో పోరాటాలు నిర్వహించామని తెలిపారు. 1957 సంవత్సరంలో గార్ల పట్టణంలో మొదటి మహాసభ నిర్వహించుకుని ఎస్ఆర్ దాట్ల అధ్యక్షునిగా, బొమ్మగాని ధర్మ బిక్షం కార్యదర్శిగా ఆ నాటి సభ ఎన్నుకుందని గుర్తుచేశారు. సంఘం ఏర్పడి నేటికీ 65 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 50 ఏళ్లుపైబడిన గీత కార్మికులకు వృత్తి పింఛన్, పదేళ్ల లైసెన్స్ పొడిగింపు, ఎక్స్‌గ్రేషియా పెంపు ఇలా అనేక సమస్యలను రాజకీయ పార్టీల కతీతంగా పోరాడి సాధించుకున్నామన్నారు. బాలగోని బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు చేయాలనీ, గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో
పిల్లల్లో నైపుణ్యం పెంపు

- రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో మంత్రి పువ్వాడ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా వారిలోని సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రం ప్రకాశ్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాల వేదికగా జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించే రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో భవిష్యత్‌లో కొత్తదనంతో ప్రయోగాలను ప్రదర్శించడానికి ఇది మంచి వేదిక అని తెలిపారు.

ఇలాంటి ప్రదర్శనలకు విద్యార్థులకు ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహం అందించాలని, సైన్స్, గణితం విషయాలకు సంబంధించిన ప్రయోగాలతో వారికి కావాల్సిన సలహాలు అందిస్తే వారి నైపుణ్యాన్ని మరింత పదును పెట్టి మంచి ఆలోచనలకు పునాదులు వేస్తారన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సుమారు 478 ప్రదర్శనలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ విపి గౌతమ్, జడ్‌పి చైర్మెన్ లింగాల కమల్‌రాజ్, సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్, డిఇఒ, యంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శిస్తున్న మంత్రి పువ్వాడ

పని కల్పించకపోవడం కూడా హింసే...

- శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సులో పుణ్యవతి
- కార్మికోద్యమంలో మహిళలను భాగస్వాములు చేయాలి : ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హింస అంటే కేవలం లైంగిక హింసే కాదనీ... పని కల్పించకపోవడమూ హింస కిందకే వస్తుందని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఉమ్మడి రాష్ట్ర పూర్వ కన్వీనర్ ఎస్.పుణ్యవతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో కన్వీనర్ పద్మశ్రీ అధ్యక్షతన మంగళవారం హైదరా బాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర మూడో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును పుణ్యవతి ప్రారంభిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏడేళ్ల కాలంలో శ్రామిక మహిళల పోరాటంలో పలువురు కొత్త వారు నాయకులుగా ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శ్రామిక మహిళలను సమీకరించేందుకు అవసరమైన క్షేత్రస్థాయి సమాచారాన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, ప్రాంతాల వారీగా సేకరించాలని సూచించారు. ఆ సేకరణ శ్రామిక మహిళలను సమీకరించి వారి హక్కుల కోసం పోరాడేందుకు ఉపయోగపడు తుందని తెలిపారు. శ్రామిక మహిళలు రంగాలవారీగా సమావేశాలు నిర్వహించుకోవాలని కోరారు. శ్రామిక మహిళలు భయాన్ని వీడాలనీ, తమ సమస్యలను చర్చనీయాంశాలుగా మార్చాలని సూచించారు. ఇతర వేదికల కన్నా మహిళలు తమ సమస్యలను విపులంగా చర్చించేందుకు శ్రామిక మహిళా సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు, కార్మికులను అణగొదొక్కే పరిస్థితిలో మార్పు కోసం జరిగే ఉద్యమాల్లో తలెత్తి పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు మాట్లాడుతూ కార్మికోద్యమంలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఏర్పాటైందని గుర్తు చేశారు. శ్రామిక మహిళ సాధించిన విజయాలతోపాటు అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా ముమ్ముందు కర్తవ్యాలపై చర్చించాలని సూచించారు. శ్రామిక మహిళలను సమీకరించేందుకు పని ప్రదేశాల వద్దకు వెళ్లాలని నాయకులను కోరారు. వస్త్రాలు, బంగారం దుకాణాలతోపాటు ప్రయివేటు ఆస్పత్రులు, థియేటర్లు తదితర ప్రదేశాల్లో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఉదహరించారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో శ్రామిక మహిళలను సమీకరించాలని సూచించారు. వారిని అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగస్వాములు చేయాలని కోరారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ నివేదికను ప్రవేశపెట్టారు. సిఐటియు అనుబంధ రంగాల వారీగా కమిటీలు వేసుకున్నామని తెలిపారు. కార్మికుల్లో, జనాభాల్లో సగభాగంగా ఉన్న మహిళలను సమీకరించకుండా ఉద్యమ లక్ష్యాన్ని చేరుకోలేమని గుర్తించి ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై హింస పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసిన బిజెపిపై సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సిద్ధిపేట తదితర జిల్లాల్లో మహిళలపై దాడులు, లైంగిక దాడులు చోటు చేసుకున్న సందర్భాల్లో 'శ్రామిక మహిళ' న్యాయం కోసం పోరాటం చేసిందని గుర్తుచేశారు. ఒకవైపు రోజువారీ సమస్యలపై పోరాటం చేస్తూనే మరోవైపు ప్రత్యామ్నాయ సంస్కృతి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆశా, అంగన్ వాడీలు తదితరరంగాల వారీగా సర్వేలు నిర్వహించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇఎస్ఐ, పిఎఫ్ లాంటివి లేకుండా కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తున్న విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మహిళల రక్షణకు సంబంధించి పద్మశ్రీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో పాటు రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE X ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
M.V.OP. 144 OF 2022
Between:
1. Rupani Salamma W/o Late Ropani Ramulu Aged 54 years Occ:house hold
2. Rupani Saidulu S/o Late Ropani Ramulu Aged 36 years Occ:Labour
3. Rupani Rajashekar S/o Late Ropani Ramulu Aged 30 years Occ: Labour
4. Rupani RamuduS/o Late Ropani Ramulu Aged 27 years Occ: Labour
5. Rupani Shailaja D/o Late Ropani Ramulu Aged 23 years Occ: Labour
6. Rupani Lakshmamma, W/o Late Iddaiah Aged 76 years Occ: house hold (Mother of deceased)
All are residents of H.No.3-22, Perepalle, village, Chittyal Mandal, Nalgonda Dist 508114.Tempropely come down to R/o 12-1-133/71, Dattatreya colony, Asifnagar, Hyderabad - 28. ... Petitioners.
AND
Bala Mallesh Macha and 2 others
To
R1) BalaMallesh Macha S/o Macha Yadaiah Agedabout. major, Occ: Business R/o H.NO.17-68, Narayanagiri, Pochampally Mandal, Yadadri-Bhongiri Dist 508284
Take notice that the above MV.OP.NO.114 OF 2022, is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 06 - 01-2023 at 10.30 A.M. in person or by an Advocate falling which the case will be decided on merits expert in your absence.
(By order of the Court)
Sd/- GK LEGAL FIRM
Rep by its partners
VANAM VINOD KUMAR, BUMANANDHAM GANJI
(TS/1355/2009)
Cell No.9949417431,
COUNSEL FOR Petitioners

అధిక ఫీజుల వసూలు చేసిన కాలేజీలపై చర్యలు తీసుకోండి

- ఇడికి కుల నిర్మూలన వేదిక ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజులు, డొనేషన్లు అధికంగా వసూలు చేసిన ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన వేదిక (కెఎన్‌వి) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అడిషనల్ డైరెక్టర్‌కు కెఎన్‌వీ అధ్యక్ష, కార్యదర్శులు పాపని నాగరాజు, కోట ఆనంద్ ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. గతంలో తెలంగాణ బహుజన విద్యార్థి సంఘం (టిబిఎస్ యు) పేరుతో ఉన్నత విద్యామండలికి, సిబిఐకి కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా అధికంగా వసూలు చేస్తున్నా ఫీజు రెగ్యులరేటరీ కమిటీ నామమాత్రంగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జెఎన్‌టియు సైతం ఈ కాలేజీలను పర్యవేక్షించడం లేదని పేర్కొన్నారు. యాజమాన్య కోటాలో ప్రతిభ అనేదే లేదనీ, ఎవరూ ఎక్కువ ఫీజులు చెల్లిస్తే వారికే సీటు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆయా కాలేజీలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలనీ, వాటిలో చేరిన విద్యార్థుల సర్టిఫికేట్లను పరిశీలించాలనీ, తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

హైదరాబాద్‌లో మహీంద్రా మల్టీ క్లయింట్ లాజిస్టిక్ గిడ్డంగి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలోనే అతిపెద్ద సమీకృత సరుకు రవాణ సంస్థల్లో ఒక్కటైన మహీంద్రా లాజిస్టిక్స్ లిమిటెడ్ (ఎంఎల్ఎల్) హైదరాబాద్ సమీపంలో భారీ మల్టీ క్లయింట్ లాజిస్టిక్ గిడ్డంగిని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలోని మైలవరంలో 17 ఎకరాల్లోని స్థలంలో ఏకంగా 10 ఎకరాల్లో (7.5 లక్షల చదరపు అడుగుల్లో) దీన్ని నిర్మించామని మహీంద్రా లాజిస్టిక్స్ ఎండి, సిఇఒ రామ్ ప్రవీణ్ స్వామినాథన్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ యూనిట్ కోసం రూ.35-40 కోట్ల పెట్టుబడి పెట్టామన్నారు. ఈ గిడ్డంగి ద్వారా 470 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. థర్డ్ పార్టీ అసోసియేట్లు అదనంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. పండగ సీజన్‌లో ఏకంగా 1200 మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. పలు దిగ్గజ ఈ కామర్స్ వేదికలు తమ ఉత్పత్తులను ఇక్కడ నిల్వ చేసుకుంటున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 250, తెలంగాణ రాష్ట్రంలో తమ సంస్థకు 14 గిడ్డంగి కేంద్రాలున్నాయన్నారు.

ప్రభుత్వ భూముల్లో వేసుకున్న

గుడిసెలకు పట్టాలివ్వాలి

- డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలి
- ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటించాలి
- వ్యకాస జిల్లా ప్రథమ మహాసభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వమే పట్టాలిచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు క్యాంపు ఎస్‌పిఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హన్మకొండ జిల్లా ప్రథమ మహాసభ గుమ్మడిరాజుల రాములు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా హసన్‌పర్తి బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి, పేదల కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మహాసభ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం భారతదేశంలో ప్రతి పౌరునికి జీవించే హక్కు కల్పించిందన్నారు. ఎర్ర జెండా నీడలో పేదలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని, వారి హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ, నివాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. పేదలు ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలు, జాగాలకు పట్టాలిచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేసేలా మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని హామీఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టం కోసం రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, పట్టణ పేదలకూ ఉపాధి హామీని విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందన్నారు. దళితులు, మహిళలు, గిరిజనుల పైన హత్యలు, లైంగికదాడులు రోజురోజుకు పెరుగుతున్నా ప్రభుత్వం వాటి నియంత్రణలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, కూరగాయల ధరలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలపై నిర్బంధాన్ని ప్రయోగించి పడగొట్టే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ దళిత బంధు ఇవ్వాలని, పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతన జిఒని సవరించి రోజు కూలి రూ.600 ప్రకటించాలని డిమాండ్ చేశారు. 57 ఏళ్ళు పైబడిన పేదలకు నెలకు రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు ఇచ్చి 14 రకాల నిత్యవసర సరుకులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎర్ర జెండా నీడలోనే పేద ప్రజల హక్కులు కాపాడబడుతాయని, పేదల పక్షాన పోరాటాలు చేస్తున్న ఎర్రజెండాను ప్రజలు ఆదరించి అధికారం అందజేయాలని కోరారు. మహాసభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, నాయకులు వెదునూరి వెంకటరాజం, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బొట్ల చక్రపాణి, జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, సతీష్, అశోక్, పెండ్యాల రవి, రాఘవులు, రజిత, అంబాల స్వరూప పాల్గొన్నారు.

నేడు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించనున్న కెసిఆర్
- పాల్గొననున్న అఖిలేష్, కుమార స్వామి
- పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల రైతు నేతలకు ఆహ్వానం

న్యూఢిల్లీ : నేడు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ కార్యాలయం ప్రారంభం కానుంది. సర్దార్ పటేల్ రోడ్డులో బుధవారం మధ్యాహ్నం బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు తొలుత జెండా ఎగుర వేసి, కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. కార్యాలయ ప్రారంభానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్‌పి అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, జెడిఎస్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమార స్వామి హాజరుకానున్నట్టు బిఆర్ఎస్ నేతలు తెలిపారు. అలాగే బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌నూ ఆహ్వానించినట్టు చెప్పారు.

పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రైతు నేతలు రాకేష్ టికాయత్, గుర్నామ్ సింగ్ చారుని తదితరులు పాల్గొనున్నారు. బిజెపి మాజీ ఎంపి సుబ్రహ్మణ్య స్వామి సైతం పాల్గొంటారని సమాచారం. బిఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం యజ్ఞయాగాది కార్యక్రమాలు జరిగాయి. బుధవారమూ కొనసాగుతాయి. తెలంగాణ నుంచి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ చిల్లర రాజకీయాల కోసం బిఆర్ఎస్ రాలేదని, తెలంగాణ రాష్ట్రంలో ఏవైతే రైతుల కోసం, పేదల కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని కేసీఆర్ భావిస్తున్నారని తెలిపారు.

దేశంలో ప్రాజెక్టులు నిర్మించి రైతులకు నీళ్ల ఇవ్వలేకపోతున్నారనీ, తాగునీరు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. దేశంలో యువకులకు ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నారని తెలిపారు. అనేక సమస్యలతో గత 50 ఏళ్ల నుంచి నలిగిపోతున్న దేశంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలని కెసిఆర్ భావిస్తున్నారని పేర్కొన్నారు.

కోవర్టుల వల్లే 'కాంగ్రెస్'కు నష్టం

- పార్టీ విధేయులకు న్యాయం జరగడంలేదు
- సీనియర్ నేత దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త కమిటీల చిచ్చు తీవ్రరూపం దాలుస్తోంది. ఇప్పటికే సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేయగా.. తాజాగా మరో సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ తన ఆవేదనను వెళ్లగక్కారు. పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లకి న్యాయం జరగడంలేదని ఆక్షేపించారు. హైకమాండ్‌ను గౌరవిస్తామని.. కానీ ఆత్మగౌరవాన్ని మించింది ప్రపంచంలో ఏదీ లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామోదర రాజనర్సింహ మాట్లాడారు.

పార్టీ పదవుల విషయంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. జిల్లాల వారీగా పార్టీ నాయకుల పనితీరును అంచనా వేసిన దాఖలాలు లేవని, విభేదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో 'భారత్ జోడో యాత్ర' విజయవంతంగా జరిగిందని చెప్పారు. కోవర్టులు ఉండటం వల్లే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోంది. వారికి పార్టీలోని అగ్రనేతలు ఎందుకు మద్దతుగా ఉంటున్నారంటూ ప్రశ్నించారు. కోవర్టులని తెలిపే ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. సమయం వచ్చినపుడు ఆ పేర్లు బయటపెడతామని చెప్పారు. పదవులు ఇవ్వొద్దని మేం అనడం లేదు. ఇచ్చేవాళ్లకి అర్హత ఉందో లేదో విశ్లేషణ, అధ్యయనం చేశాక ఇవ్వాలని మాత్రమే చెప్తున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ తమకు మాతృ పార్టీ అని దాన్ని కాపాడుకోవాలనే ఆశతో ఉన్నామన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ఆత్మగౌరవంతో బతుకుతామని చెప్పారు. కమిటీల ఏర్పాటులో జరిగిన తప్పులను సవరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌లో ప్రక్షాళన జరగాలన్నారు. లేకపోతే భవిష్యత్‌లో నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. నిరుత్సాహ పరిచేందుకు ఇలా మాట్లాడటం లేదని అన్నారు. ఎన్నికలకు ఏడాది సమయం ఉంది. కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని దామోదర రాజనర్సింహ కోరారు.

సిబిఐ భయంతోనే కవిత 'జాగృతి' నినాదం : కొండా సురేఖ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్, ఎమ్మెల్సీ కవితపై మాజీ మంత్రి కొండా సురేఖ తీవ్ర విమర్శలు చేశారు. బిఆర్ఎస్ పార్టీ అంటే భారత రాబడి పార్టీ అని.. భారతదేశాన్ని దోచుకోవడం కోసమే బిఆర్ఎస్ పెట్టారని విమర్శించారు. అటు జాగృతి పేరుతో ఎమ్మెల్సీ కవిత రూ.కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. తెలంగాణలో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక జాగృతిని ఆమె పట్టించుకోలేదన్నారు. ఇటీవల ఢిల్లీ మద్యం కేసులో తనపై అభియోగాలు రావడంతో మళ్ళీ జాగృతి నినాదం అందుకుందని విమర్శించారు. సిబిఐ తనను అరెస్టు చేస్తుందేమోన్న భయం కవితను వెంటాడుతుందని, అందుకే జాగృతిని అడ్డుపెట్టుకుని సిబిఐ నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

వాణిజ్య వాహన ధరలు పెంచిన టాటా

న్యూఢిల్లీ : టాటా మోటార్స్ తన వాణిజ్య వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. కొత్త ఏడాది జనవరి నుంచి అన్ని రకాల వాణిజ్య వాహనాలపై 2 శాతం వరకు ధరలు పెరుగుతాయని పేర్కొంది. మోడల్‌ను బట్టి ధరల పెంపు ఉంటుందని తెలిపింది.

వచ్చే వారంలో 300 పడకల బ్లాక్ ప్రారంభం

- ఎంఎన్‌జె ఆస్పత్రిపై మంత్రి హరీశ్ రావు సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే వారంలో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రిలో 300 పడకలతో కూడిన కొత్త బ్లాక్‌ను ప్రారంభించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు తెలిపారు. మంగళవారం ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రితో పాటు నిమ్స్ ఆస్పత్రిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో కలుపుకుని క్యాన్సర్ చికిత్స కోసం 750 పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పాలియేటివ్ సేవల గురించి అవగాహన కల్పించి ఎక్కువ మందికి సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొబైల్ స్క్రీనింగ్ బస్ ద్వారా నిర్వహించే క్యాంపుల సంఖ్యను పెంచడంతో పాటు వాటిని మారుమూల ప్రాంతాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు. రోగులు, వారి సంబంధీకులతో సెక్యూరిటీ, నాల్గవ తరగతి ఉద్యోగులు గౌరవంగా మెలగాలని సూచించారు.

పిల్లల్లో జన్యులోపాలు నివారించేలా ముందస్తు పరీక్షలు చేయాల్సిన అవసరముందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ విషయంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని నిమ్స్ జెనిటిక్స్ విభాగంతోపాటు ప్రసూతి ఆరోగ్య సంయుక్త సంచాలకులను ఆదేశించారు. నిమ్స్‌లో ఓపీ పెరిగిన రీతిలో కౌంటర్లను పెంచాలనీ, ఐఎంబొలో బెడ్లు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అవయవదానంపై అవగాహన పెంచాలనీ, అవసరమైతే బ్రెయిన్ డెడ్ అయిన కుటుంబ సభ్యులకు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. తాను కూడా ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి ఒప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డయాలసిస్ సెంటర్లను నిమ్స్ నుంచి పర్యవేక్షించాలని సూచించారు.

జడ్జి శాలినికి మంత్రి శుభాకాంక్షలు

హన్మకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆర్మూర్ న్యాయస్థానం జూనియర్ సివిల్ జడ్జి శాలినికి వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. సిఎం కెసిఆర్ మార్గనిర్దేశంలో రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానాల్లో ఉత్తమ వైద్య సేవలందుతున్నాయని పేర్కొన్నారు.

ముమ్మరంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు ఊపందుకున్నాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. అధునాతన హంగులతో స్టేషన్లను తీర్చిదిద్దేందుకు వీలుగా రైల్వే మంత్రిత్వ శాఖ పలు చర్యలు చేపట్టిన నేపథ్యంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గిర్ధారిలాల్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పనులను చేపట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టును ఇంజనీరింగ్ ప్రొక్యూర్మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో అక్టోబర్, 2022లో కేటాయించినట్టు పేర్కొన్నారు. 36 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.699 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న మరో తుపాను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై మాండూస్ ప్రభావం కొనసాగుతుండగానే మరో తుపాను ముంచుకొస్తున్నది. బంగాళాఖాతంలో దక్షిణ అండమాన్ ప్రాంతంలో మంగళవారం ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ఆ తర్వాత క్రమంగా బలపడి అల్పపీడనంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 16 తర్వాత అది తుపానుగా మారే అవకాశం కూడా ఉందని తెలిపింది. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. శ్రీలంకను ఆనుకుని ఉన్న గల్ఫ్ ఆఫ్ మన్నార్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావం కారణంగా ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రంలోని డెల్టా జిల్లాలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ అండమాన్ ప్రాంతంలో ఏర్పడే ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా మంగళ, బుధవారాల్లో అండమాన్ నికోబార్‌లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిధుల లేమితో అర్ధాంతరంగా..

నిలిచిన 'కాళోజీ' పనులు

- ఆరేళ్లయినా పూర్తి కాని వైనం..
- సిఎం డ్రీమ్ ప్రాజెక్టు దుస్థితి

సగంలో నిలిచిపోయిన 'కాళోజీ' కళావేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళోజీ కళాక్షేత్రాన్ని రవీంద్రభారతిని తలదన్నేలా నిర్మిస్తామని సిఎం కెసిఆర్ చెప్పి ఆరేళ్లు గడిచినా నేటికీ పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. ప్రజా కవి కాళోజీ నారాయణరావు పేరిట నిర్మిస్తున్న కళా వేదిక నిర్మాణాన్ని రూ.50 కోట్ల అంచనా వ్యయంతో 2016లో పనులు ప్రారంభించారు. సిఎం కెసిఆర్ రవీంద్రభారతిని తలదన్నేలా కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. 2018లో ఈ పనులు పూర్తి కావాల్సి ఉన్నా ఆరేండ్లయినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కొన్నేళ్లుగా పనులు నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తొలుత కళా వేదిక పనులు చేపట్టింది. నిధులు లేక చేతులు ఎత్తేయడంతో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అప్పగించి వారి నిధుల నుంచి కళాక్షేత్రానికి రూ. పది కోట్లు మళ్లించారు. రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ పనులు ప్రస్తుతం రూ.70 కోట్లకు పెరిగి ప్రజాకవి కాళోజీ పేరును తెలంగాణ ఉద్యమంలో వినియోగించుకున్న సిఎం కెసిఆర్ తన మాటను నేటికీ నిలబెట్టుకోకపోవడంతో కళాకారులు, కవులు, మేధావులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు

2014లో సిఎం కెసిఆర్ కాళోజీ కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 4.5 ఎకరాలలో రూ.50 కోట్లతో ఈ కళావేదికను నిర్మించాలని నిర్ణయించారు. రెండేండ్ల అనంతరం 2016 జనవరిలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎస్‌టిడిసి) ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. 4 అంతస్తులతోపాటు 32 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఇందులో ఆర్ట్ గ్యాలరీ, లైబ్రరీ, మ్యారేజీ హాలు, లెక్చర్ హాలు, గ్రీన్ రూమ్, రిహార్సల్స్ రూమ్‌ల నిర్మించాల్సి వుంది. 1,100 మంది సీటింగ్ కెపాసిటీతో ఆడిటోరియం నిర్మాణానికి డిజైన్ చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఈ నిర్మాణానికి రూ.పది కోట్లు విడుదల చేసింది. టిఎస్‌టిడిసి ఆధ్వర్యంలో శ్రీకో ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ ఈ పనులను తొలుత చేపట్టింది. పలు దశల్లో నిర్మించిన పనులకుగాను రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో సదరు కంపెనీ పనులు నిలిపివేసింది.

ఈ దశలో కొన్నేండ్ల పాటు నిర్మాణం నిలిచిపోయింది. మరో రెండేళ్లు కరోనాతో పనులు నిలిచిపోయాయి. అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పున్ణప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ ప్రదర్శించకపోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం 'కుడా' నుంచి రూ.10 కోట్ల నిధులను కళావేదిక పనులకు బదిలీ చేయడంతో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. కొద్దిరోజులయ్యాక నిధులు ఇవ్వడంలో మళ్లీ తీవ్ర జాప్యం జరగడంతో పనులూ నిలిచిపోయాయి.

నిధుల లేమితో పెరుగుతున్న అంచనా వ్యయం

రూ.50 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన కాళోజీ కళావేదిక నిర్మాణంలో శంకుస్థాపన నాటి నుంచి నేటి వరకు ఎనిమిదేళ్లు జాప్యం కావడంతో దాని అంచనా వ్యయం రూ.70 కోట్లకు పెరిగింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీకో ప్రాజెక్ట్స్ ప్రయివేటు లిమిటెడ్ చేసిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా తప్పుకుంది. తాజాగా బృందావన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులు చేపట్టింది. నిధుల లేమితో ఈ కంపెనీ కూడా అర్ధాంతరంగా పనులు నిలిచివేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.పది కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. పైగా ఇప్పుడు ప్రాజెక్టు అంచనావ్యయం మొదటి కంటే రూ.20 కోట్లు అదనంగా పెరగడంతో 'కుడా' కూడా ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ధైర్యం చేయలేని పరిస్థితిలో ఉంది. టిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ పాలన ఎనిమిదేళ్లు పూర్తయినా కాళోజీ కళా వేదిక పూర్తి కాకపోవడం వరంగల్ వాసులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

అరవింద్‌పై పోటీ చేయమంటే చేస్తా : కవిత

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు బ్రెయిన్ డ్యామేజ్ అయ్యిందని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ... "బాస్ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తా.. అరవింద్ మీద పోటీ చేయమంటే చేస్తా.. పోటీ చేయకపోయినా.. అరవింద్ ఓటమి కోసం వెళ్లి ప్రచారం చేస్తా'నని స్పష్టం చేశారు. తెలంగాణ సిఎంగానే కెసిఆర్ జాతీయ స్థాయిలో పనిచేస్తారని తెలిపారు. ఆంధ్ర ప్రజలను ఎప్పుడు తాము తిట్టలేదని అన్నారు. ఆంధ్ర నేతలను మాత్రమే విమర్శించామని.. దానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని కవిత వెల్లడించారు.

స్టార్టప్‌లకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నిధులు

న్యూఢిల్లీ : స్టార్టప్‌లకు నిధులు మంజూరు చేసినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. స్టార్టప్ ఇండియా కార్యక్రమానికి నిధుల సహకారం అందించడానికి కేంద్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అరవ వార్షిక నిధుల కార్యక్రమంలో కొంత మొత్తాన్ని సమకూర్చినట్లు ఆ బ్యాంక్ పేర్కొంది. పలు సామాజిక రంగాల్లో పని చేస్తున్న 165 స్టార్టప్‌లకు ఇప్పటి వరకు రూ.30 కోట్లు అందించినట్లు తెలిపింది.

ప్రసవం కోసం వెళితే పసిబిడ్డ ప్రాణం తీశారు.!

- ప్రయివేటు నర్సింగ్ హోంలో ఘటన
- ఆస్పత్రి ముందు బాధిత కుటుంబ సభ్యుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పురిటి నొప్పులతో బాధపడుతూ ప్రసవం కోసం ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళితే.. ఆపరేషన్ చేసి విగతజీవిగా ఉన్న పసిగుడ్డును చేతిలో పెట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబీకులు మంగళవారం ధర్నా చేశారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రయివేట్ నర్సింగ్‌హోంలో జరిగింది. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన సాయి లక్ష్మి రెండోసారి గర్భవతి. కాన్పు కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో చేరారు. అక్కడ వైద్యులు పరీక్షించి సాధారణ ప్రసవం కాదని, ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్‌కు రూ.45 వేలు, ఫ్యామిలీ ప్లానింగ్ కూడా చేయాలంటే మరిన్ని డబ్బులు అవుతాయని చెప్పారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ తర్వాత చేయించుకుంటామని చెప్పిన కుటుంబీకులు.. ప్రసవానికి సంతకం చేశారు. సాయంత్రం 6:30 గంటలకు ఆపరేషన్ చేశారు. కానీ, పుట్టిన బాబు చనిపోయాడు. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితులు ఆరోపించారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రహదారిపై ధర్నా

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని సిరిపురం చౌరస్తాలో గల ప్రధాన రహదారిపై బాధిత కుటుంబ సభ్యులు బైటాయించారు. జనరల్ డాక్టర్ అయినప్పటికీ డబ్బుల కక్కుర్తిపడి ఆపరేషన్లు కూడా చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అత్యాధునిక న్యూరో మెడికల్ పరికరాల ఆవిష్కరణ

- కొత్త ప్లాంట్‌కు రూ.200 కోట్ల పెట్టుబడి
- ఎస్3వి వాస్క్యులర్ టెక్నాలజీ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

పక్షపాతాన్ని తిప్పికొట్టడంలో ఉపయోగపడే అత్యాధునిక, విప్లవాత్మకమైన న్యూరో క్లాట్ రిట్రీవర్, న్యూరో ఆస్పిరేషన్ కాథెటర్, న్యూరో మైక్రోకాథెటర్ పరికరాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎస్3వి వాస్కులర్ టెక్నాలజీస్ వెల్లడించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంగళవారం ఆ కంపెనీ వ్యవస్థాపకులు బదరీ నారాయణ్ మాట్లాడుతూ.. ఈ ఉత్పత్తులను గురువారం గవర్నర్ తమిళసై ఆవిష్కరించనున్నారని తెలిపారు. దేశంలోనే తొలిసారి తాము ఈ ఉత్పత్తులను తయారు చేస్తున్నామన్నారు. మైసూర్‌లో రూ.200 కోట్లతో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ప్రతి సంవత్సరం 20 లక్షల బ్రెయిన్ స్ట్రోక్‌లు జరుగుతుండగా, కేవలం 1500 మాత్రమే ఇంటర్వెన్షనల్ విధానాలకు వెళుతున్నారని వెల్లడించారు. తమ సంస్థ హై-ఎండ్ స్ట్రోక్ ట్రీట్‌మెంట్ టెక్నాలజీని చౌక వ్యయంలో సామాన్యులకు అందించడానికి ప్రయత్నిస్తోందన్నారు. రాబోయే దశాబ్దంలో ఇంటర్వెన్షనల్ విధానాల సంఖ్య సంవత్సరానికి కనీసం 2.5 లక్షలకు పెరగవచ్చని ఆయన అంచనా వేశారు. ఈ పరికరాలతో, గోల్డెన్ అవర్‌లో ప్రక్రియలు సకాలంలో జరిగితే, రక్త ప్రసరణ పునరుద్ధరించబడటానికి, పక్షవాతం తిరగబెట్టడానికి అధిక అవకాశం ఉందన్నారు. గ్లోబల్ కంపెనీలతో పోల్చితే తమ పరికరాల ధరలు కూడా చాలా తక్కువ ధరకు లభించనున్నాయన్నారు. ప్రభుత్వ వైద్యం, బీమాలో అందించే చికిత్సకు అనుగుణంగా ధరలను నిర్ణయించనున్నామన్నారు. ఇస్కీమిక్ బ్రెయిన్ స్ట్రోక్ (గడ్డకట్టడం వల్ల మెదడు నాళాలు అడ్డుపడటం వల్ల వచ్చే స్ట్రోక్) చికిత్సలో గోల్డ్ స్టాండర్డ్ మెకానికల్ థ్రోంబెక్టమీ, మెదడులోని నాళంలో చిక్కుకున్న గడ్డను తొలగించడానికి క్యాథ్ ల్యాబ్‌లో చేసే ఇంటర్వెన్షనల్ ప్రక్రియ. కంపెనీ టెస్ట్ లైసెన్స్‌లను పొందిందని, తయారీకి అనుమతి లభించిన వెంటనే వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) మాజీ సిఎండి ఎంవి గౌతమా, ఎస్3వి డైరెక్టర్ డాక్టర్ విజయ్ పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న బదరీ నారాయణ్